## 1987 దీపావళి 'మినీ కథల పోటీ'లో రు.75 బహుమతి పొందిన రచన

# వల

ఎస్. కె. నాగేశ్వర రావు



**అద్దె పుస్తకాల షాపు నడుపుతున్న సత్యమూర్తి స్వతహాగా రచయిత. అడపా దడపా అతని కథలు పత్రికల్లో వస్తుంటాయి. సత్యమూర్తి వున్న వీధి లోనే సులేఖ వుంటోంది.**

ఆమె వూర్లోనే వున్న కాలేజీలో డిగ్రీ చదువుతోంది. మంచి అందగత్తె. ఆమెకన్నా నల్లగా నిగనిగలాడే కళ్ళూ, పిరుదులు దాటిన జడ మరింత అందంగా వుంటాయని అందరూ అంటూ వుంటారు.

సత్యమూర్తి రాసే కథలు చదివాక, తనూ రచయితగా మారాలన్న కోరిక కలిగింది సులేఖ మనసులో. అందుకు సత్యమూర్తి సహాయం కోరింది. సులేఖ వంటి స్టన్నింగ్ బ్యూటీ స్వయంగా వచ్చి అతన్ని అర్థించడంతో కాదనలేక పోయాడతను. ముగ్గురు పిల్లల తండ్రయినా సత్యమూర్తికి రంగుపిచ్చి జాస్తి. తరచూ సులేఖ అతని షాపుకొచ్చి కూర్చునేది. ఆమెకు కథలు రాయడం నేర్పడం కన్నా తన కథలే ఆమె పేరిట పంపడంలో సుఖం కనిపించి అలాగే చేయసాగేడు సత్యమూర్తి.

* * * * *

సులేఖ కథలన్నీ పత్రికల్లో వస్తున్నాయి. 'పూబంతి' అనే పత్రిక పెట్టిన పోటీలో ఆమె కథకు బహుమతి రావడంతో, ఫోటోతో పాటు ఆమె పరిచయాన్ని కూడా రంగుల్లో వేశారా పత్రికవాళ్ళు. ఆ సందర్భంగా ఆ కథ చదివిన రేడియో ఆర్టిస్టు స్ఫూర్తి ఆమెకు పరిచయమయ్యాడు.

సులేఖ అందం అతన్ని పిచ్చెక్కించింది. అది గమనించిన ఆమె తనలో రేడియో ప్రోగ్రాములు ఇవ్వాలన్న కోరికను వెళ్ళగక్కింది.

"ఓ...యస్!" అన్నాడు స్ఫూర్తి మత్తుగా ఆమెనే చూస్తూ.

* * * * *

స్ఫూర్తితో పరిచయమయ్యి నాలుగు వారాలు కూడా కాకుండానే సులేఖ వ్యాసాలు, కవితలు, కథానికలు వరుసగా రేడియోలో ప్రసారం అవడం ప్రారంభమయ్యాయి! ఆమె కంఠంలో మార్దవానికి, మాధుర్యానికి అచ్చెరువొందిన రాజారావు అనే టి.వి. ప్రోగ్రాం ఆఫీసరు సులేఖను టి.వి.కి ఇంటర్వ్యూ చేద్దామని ప్రత్యేకంగా హైదరాబాదు నుండి వచ్చాడు.

అతన్ని సాదరంగా ఆహ్వానించింది సులేఖ.

"మీ గొంతే అనుకున్నాను మీ రూపం కూడా అందమైనదేనండీ!" అన్నాడు రాజారావు ప్రశంసాపూర్వకంగా ఆమెనే చూస్తూ.

అలవోకగా నవ్వింది సులేఖ.

నెల తిరక్కుండానే సులేఖ పరిచయ కార్యక్రమం టి.వి.లో ప్రసారమయింది. ఆ తర్వాత వరుసగా రాజారావు ఇస్తున్న ప్రోత్సాహంతో అంచెలంచెలుగా ఎదిగి టి.వి. ఎనౌన్సరయింది.

* * * * *

షూటింగ్ పేకప్ చేసి అప్పుడే ఇంటికి వచ్చిన యువ సినీ దర్శకుడు నాగేంద్ర రిలాక్సింగ్‌గా సోఫాలో వాలి, టి.వి. ఆన్ చేసి చూడసాగేడు.

వెంటనే టి.వి. స్క్రీన్‌పై ప్రత్యక్షమైన ఆమె అందానికి, గొంతులో మాధుర్యానికి మూర్ఛ వచ్చినంత పనయింది అతనికి. ఆమె సులేఖ!

నాగేంద్ర బుర్రలో మెరుపులాంటి ఆలోచన ఫ్లాష్‌లా వెలగడంతో మరింక ఆలస్యం చేయకుండా బయటకు కదిలాడు వేగంగా.

* * * * *

ఇప్పుడు- సినీ ప్రేక్షకుల అందాల ఆరాధ్య దేవత సులేఖ. నాగేంద్ర ఆమెతో తీసిన సినిమా ఫెయిలయినా ఆమె 'నటన' పరిశ్రమను ఆకర్షించడంతో ప్రస్తుతం ఆమె చేతిలో ఇరవై సినిమాలున్నాయి. మరికొన్నింటికి సైన్ చేయాల్సుంది.

అయితే, సులేఖకు ఫస్ట్ లిఫ్ట్ ఇచ్చిన రచయిత సత్యమూర్తి పుస్తకాల షాపు అమ్మేసి రోడ్లు కొలుస్తున్నాడు. రేడియో ఆర్టిస్ట్ స్ఫూర్తి సులేఖ ఇచ్చిన హేండ్‌ను మరచిపోలేక డ్రింకుకు బానిసయ్యాడు.

ఇక, టి.వి. ప్రోగ్రాం ఆఫీసర్ రాజారావు సులేఖ అందాన్ని మరచిపోలేక దాదాపు పిచ్చెక్కడంతో 'విశాఖ ఆసుపత్రి'లో చికిత్స పొందుతున్నాడు.

యువ దర్శకుడు నాగేంద్ర తను తీసిన తొలి చిత్రమే ఘోరంగా ఫ్లాపవడంతో, అవకాశాలు దొరక్క 'సులేఖ నటిస్తున్న సినిమా వాల్ పోస్టర్లు' చూసుకుంటూ పాండీ బజార్లోనే తిరుగుతున్నాడు ఇంకా.

వింతేమిటంటే తన భవిష్యత్ కోసం అందాన్ని ఎరగా వేసి తమని ఉపయోగించుకుందన్న సంగతి వాళ్ళు నలుగురికీ ఇప్పటిదాకా తెలిసిరాలేదు!